# అందని రాగాలు

రాధాయి డాబామీద నాన్న పక్కలో దొల్లుతున్నాడు. ఇవాళ వాడికి నిద్రకూ చాలా దూరమైపోయింది. అమ్మా నాన్నా కూడా అంత ఉత్సాహంగా లేరు. పగలంతా కష్టించి, ఫలితంగా పట్టెడు ముద్దనుకూడా పొందలేక పస్తులు పడుండే పాటకపుజనాన్ని కూడా చిరుగాలి వీవనతో వెలుగుపాటలతో బాధనంతా మరిచిపోయి పరవశమయేటట్లు నిద్రపుచ్చ గలిగిన ఆ వెన్నెలరాత్రి కూడా వారి ముఖాన విషాదచ్ఛాయలను పోగొట్టలేకపోతోంది. కనీసం రాధాయి చిన్ని హృదయాన్నైనా మురిపించి మురిపించలేక పోతున్నది.

మెడవరకూ కప్పుకున్న దుప్పటిలో విసుగ్గా పక్కకు ఒత్తిగిలాడు రాధాయి.

"వెధవాయి ఏదో నిద్రపోలేదింకా, ఊరికే దొల్లుతున్నాడు" అన్నాడు నాన్న?

"వాడికి మాత్రం బెంగగా ఉండదూ. మనకే ఇలా ఉందే" అని అమ్మ అంది. "రోజూ ఈ పాటికి ఇక్కడే కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్లు" అంది అమ్మ. ఈ మాటల్లో కనిపించిన సానుభూతికి రాధాయికేడుపొచ్చింది.

'అవును అక్క తనకెన్నో కబుర్లు చెప్పేది. రోజూ అక్కా తనూ అక్కడే పక్కేసుకుని పడుకునేవాళ్ళు. అక్కను ఎన్నో అడిగేవాడు. తెల్లనివెన్నెల్లో అస్పష్టంగా కనుపిస్తున్న చెట్ల వెండి రెక్కలను టపటప లాడిస్తూ వింతగా అరుస్తున్న పక్షులను గురించి అక్కను ఏవేవో అడిగేవాడు. అక్కకూడా అన్నిటికీ సమాధానం చెప్పేది ఓపిగ్గా. తెల్లగా వెన్నముద్దలా ఉన్న చందమామను గురించీ, మిలమిలా మెరుస్తూ తన వైపే చూస్తున్నట్టున్న చుక్కల్ని గురించీ అక్క తనకెన్నో కథలు చెప్పేది. అక్కకివన్నీ ఎలా తెలిశాయో అనుకునేవాడు. తన అక్కకు తప్ప ఇంకెవరి అక్కలకూ తెలియవనుకునేవాడు. ఒక్కసారిగా అక్క మీద అభిమానం పుట్టుకొచ్చేది. ఆప్యాయంగా అక్క వొళ్లోచేరి 'ఇవన్నీ నీకెవరు చెప్పారే' అనేవాడు. యోచనగా అక్క చిన్నగానవ్వి కాసేపాలోచించి 'ఆ చందమామ చెప్పాడురా' అనేది. తన కాశ్చర్యం కలిగేది. తనెంత ఆలోచించినా అక్కకు చందమామ కథలెప్పుడెలా చెప్పుతాడో అర్థమయ్యేది కాదు. కాని అక్క అబద్ధం చెప్పదనే నమ్మకంతో అది నిజమే ననుకొనేవాడు. ఐనా ఎప్పుడు చెప్పాడో అక్కను కనుగొందామని నోరు తెరిచేసరికి, 'ఇంకా పడుకోలేదూ? తెల్లవారి ఎనిమిదైనా లేవరు.' అని నాన్న గద్దింపులు వినబడేవి. అప్పటికి నిద్రపోవాలనే సంగతి గుర్తుకొచ్చి అక్క పక్కలో చేరి అక్క చెప్పిన కథలు గుర్తుకు తెచ్చుకుంటూ, తనకుకూడా చందమామ ఎప్పుడైనా కథలు చెప్తాడేమో ననే ఆశతోనే నిద్రపోయేవాడు.

ఇప్పుడు రాధాయి మనస్సులో ఆ జరిగిపోయిన వన్నీ తిరిగిపోతున్నై.

అమ్మా నాన్నా దగ్గర ఉన్నాకూడా వాడికావేళ ఏదో ఒంటరిపాటుగానే ఉంది.

"అక్క ఎప్పుడొస్తుందో?..." పక్కకు తిరిగి పడుకుంటూ తనలో తానే అనుకున్నాడు మెల్లిగా.

**శ్రీ చల్లా చంద్రమౌళి**

నిద్ర రావడం లేదు. అసలు నాన్న దగ్గర పక్క కుదరడం లేదు వాడికి.

"...అమ్మదగ్గిర పడుకుంటే???" రాధాయి మెల్లిగా లేచాడు.

"ఎందుకురా లేచావు, పడుకో" అన్నాడు నాన్న.

'నిద్రపట్టడం లేదు నాన్నా.'

ఎందుకు పట్టడం లేదో నాన్నకు తెలుసు. కాబట్టే గద్దింపుగా రావలసిన మాటలు, బుజ్జగింపుగా వచ్చినై "కళ్ళుమూసుకు పడుకో నాన్నా, నిద్రపడుతుంది."

'అమ్మదగ్గర పడుకుంటాను నాన్నా' గారాబంగా అడిగాడు.

'అమ్మ దగ్గర పాపాయుందిగా'.

'అటువేపు పడుకుంటాను.'

'ఒద్దులే. ఇక్కడే పడుకో.'

నాన్న వద్దనేసరికి అమ్మ దగ్గరే బా -- టుందని రాధాయికి ఇంకా ఎక్కువగా అనిపించింది.

'పోనీ పంపండి ఇటువైపు పడుకుంటాడు' అని అమ్మ అంది. "రోజూ అక్క దగ్గర పడుకునేవాడు, నా దగ్గరైనా కాస్త నిద్రపోతాడేమో.'

'ఏరా? అమ్మదగ్గరన్నా నిద్రపోతావా? ఇట్లాగే దొల్లుతుంటావా?'

'నిద్రపోతాను.'

అమ్మ దగ్గర కొచ్చి పడుకున్నాడు. నిద్రపట్టడం కోసం నాన్న చెప్పిన సూత్రాన్ననుసరించి కళ్లుగట్టిగా మూసుకున్నాడు.

...కానీ...అక్కడకూడా వాడికేం సంతృప్తిగా లేదు. నిద్రకూ వాడికీ చాలా దూరం ఏర్పడిందా వేళ...పక్కకు తిరిగి కళ్లు తెరిచాడు. అక్కా తనూ పడుకునే మంచం కాళీగా ఎత్తిపెట్టివుంది. 'అక్క మళ్ళీ ఎప్పుడొస్తుందో?' అంటూ పక్కకు ఒత్తిగిల్లాడు రాధాయి.

'సన్నాసి ఊరికే దొల్లుతున్నాడండీ' అని అమ్మ అనునయంగా అంది. 'ఇవాళ వాడికి మనదగ్గర నిద్రపట్టడం లేదు కామాలు.'

'కళ్లుమూసుకు పడుకోరా' నాన్న కొంచెం గదిమాడు.

'గదమకండీ అసలే వాడదోరకంగా ఉంటే?...'

'అదోరకమేమిటి వాడిమొహం నువ్వే ఏదో రేపెడుతుంటావు—'

నాన్న అలా అనాలని అన్నట్టుగా అన్నాడు.

'నేను రేపెట్టాలీ? ఇన్నేళ్ళొచ్చి మనకే ఇట్లా ఉందే. మరి వాడు బెంగపడ్డాడంటే పడడూ? ఊహ తెలిసినప్పటినుంచి దాన్నొదిలెరగడాయెను!—'

ఆ మాటకు నాన్నకూడా నిట్టూర్చాడొక్కమాటు.

అమ్మ మళ్ళీ అంది. 'అక్కడ అదెల్లా ఉందో? ఒక్క క్షణం వాణ్ణొదిలుండేది కాదు.'

రాధాయి ఒక్క ఊపులో బావగారి వూళ్లో పోయిపడ్డాడు. అక్క ఇప్పుడేం చేస్తుంటుందో?...ఎవరికైనా కథలు చెప్తుంటుందేమో?... ఎవరికి చెప్తుందీ?...ఒకవేళ బావకు చెప్తుందేమో?...ఆ ఆలోచన కలిగేసరికి రాధాయికి నవ్వొచ్చింది.

అక్క అసలు బావతో మాట్లాడనే మాట్లాడదు. స్నానానికి పిలవడానికీ, ఫలహారమివ్వడానికీ తననే పంపేది. అక్క బావకు కథలెలా చెప్తుందీ! ఒకవేళ

చెప్పినా చిన్నపిల్లలకేం బావ కథలు వింటూ నేమిటి?... తెలిసీ తెలియని రాధాయి ఊహల్లో ఏమేమో తిరిగి పోతున్నై.

'ఏమోలే; నా బరువు తీరింది. వాళ్ళ పిల్లను వాళ్ళ కప్పచెప్పి దానింటికి దాన్ని పంపించాను.' ఇందాకటినుండీ ఏదో ఆలోచిస్తున్న నాన్న బరువుగా నిట్టూరుస్తూ అన్నాడు.

రాధాయి కీ మాటలు వింతగా ఉన్నై. 'అక్క వాళ్ళ పిల్లా? అక్క ఇల్లు ఇది కాదూ?, అయితే నేనెవరి పిల్లాణ్ని?, నా ఇల్లేదీ?...రాధాయి కేమీ అర్థం గా లేదు...పోనీ అమ్మనడిగితే?...కోప్పడు తుందేమో?...రాధాయి కొంచెం సంశయించాడు. 'అక్కైతే అన్నిటికీ ఓపిగ్గా సమాధానం చెప్పేది.'

'అక్క ఇల్లు ఇదికాదటే అమ్మా?' అడిగేశాడు ఉండబట్టలేక కొట్టినా సరేనని. అమ్మకునవ్వువచ్చిందా అమాయికప్రశ్నకు.

'ఇదెందు కౌతుందీ? ఇది నీ ఇల్లు' నవ్వులోనే సమాధానం చెప్పింది.

'అయితే మరి అక్కకు?'

'బావగారిల్లే అక్క ఇల్లు'

'ఐతే అక్క ఇహ ఇక్కడ ఉండదూ?'

'ఏమో బావ దయ, బావపంపితే రెండు పూట లుండిపోతుంది. లేకపోతే లేదు', అమ్మలో మళ్లీ కొంచెం విషాదరేఖలు తల లెత్తినై.

రాధాయి కిదేమీ అర్థంకాలేదు. అమ్మ చెప్పిన సమాధానంవల్ల ఏమీ అర్థం కాక పోయినా కొత్త సమస్యలు తలలెత్తినై వాడి మెదడులో. 'ఇది అక్క యిల్లు కాదూ?' నా ఇల్లా?...'తనకంటే పెద్దదైన అక్క ఇల్లు కాకుండా తన దెందుకైంది? రాధాయి చిన్న మెదడెంతాలోచించినా ఈ ప్రశ్నకు సమాధానంలేదు. 'అసలిది తన ఇల్లని ఎప్పుడూ అనుకోలేదే?' అసలా మాటే తనకు తట్టలేదు. అమ్మా, నాన్నా, తనూ, పాపాయీ, అందరిదీ ఈ ఇల్లను కునేవాడు తను. మరి అమ్మ తనిల్లంటుం దేం?...

"అయితే అమ్మా? అక్కది కాకుండా నా ఇల్లెందుకైందే?"

అడిగాడో లేదో 'పలక్కుండా పడుకో వెధవా' అని గదిమాడు నాన్న. అమ్మైనా సమాధానం చెప్పకుండా 'నాన్న కోప్పడ తారు కళ్లుమూసుకు పడుకో నాయనా!' అని బుజ్జగింపుగా చెప్పింది

'ఈ పెద్దవాళ్లెప్పుడింతే, అక్కైతే?

అవును అక్కైతే అన్నిటికీ సమాధానం చెప్పేది ఓపిగ్గా' రాధాయి కేడుపొచ్చింది

'ఎప్పుడో బావ పంపిస్తే తప్ప అక్క



రాధాయికి ఎందుకో భయంపుట్టింది కళ్లుతెరిచి ఆకాశంవైపు చూశాడు దొరికిన చుక్కలన్నిటినీ మింగుతూ, చందమామను కూడా పట్టుకోడానికి పరుగెత్తుతున్నై మబ్బులు

మళ్ళీరాదు అదైనా రెండు పూటలే వుంటుంది' రాధాయి మనస్సులో నిరాశ పెద్దపెట్టున చీకట్లు నింపింది

'అక్కకు మాత్రం అక్కడేం తోస్తుం దనీ', 'మళ్ళీ తప్పక వస్తుందనీ' తెలిసీ తెలియని వాడి ఊహకు తట్టినప్పుడు ఒక చిన్న ఆశాబీజం మొలకెత్తినా 'వాళ్ళ పిల్ల వాళ్ళింటికి వెళ్ళింది' తనింటికి రావనే భావం విషపురుగై దాన్ని మొదలంటా తినేస్తున్నది

అక్క ఊరికి వెళ్ళినప్పటినుండీ బెంగ

# అందని రాగాలు

గానే ఉన్న రాధాయికి ఇప్పుడు అమ్మ చెప్పిన మాటలతో పిచ్చెత్తినట్టైంది.

'ఇది అక్క ఇల్లు కాకుండా తనదెందుకైంది' దనే సమస్యలో అక్క మళ్ళీ రాదనే నిరాశ గట్టిగా బిగుసుకు పోయింది.

ఆశానిరాశల అంచుల్లో కళ్లు మూసుకుని దిగులుగా పడుకున్న రాధాయిని చూచి 'నిద్రపోయా'డని సంతృప్తి పడ్డారు అమ్మా నాన్నా.

రాధాయికి నిద్రపట్టలేదు. కళ్లు మూసుకుంటే గజిబిజిగా ఉంది. 'అక్క మళ్లీ రాదూ?'...ఇది వాళ్లిల్లు కాదుగా!...నా ఇంటి కెందుకొస్తుందీ? రాధాయికి ఎందుకో భయం పుట్టింది. కళ్లు తెరిచి ఆకాశం వైపు చూశాడు దొరికిన చుక్కలన్నిటినీ మింగుతూ చందమామను కూడా పట్టుకోడానికి పరుగెత్తుతున్నై మబ్బులు. మబ్బుల్లో పడబోతున్న చందమామ కూడా జాలిగా చూస్తున్నాడు రాధాయి కేసి.

'అక్క ఇల్లు ఇది కాదుగా, ఎందుకొస్తుందీ' అని చందమామ జాలిగా తనతో అంటున్నట్టు అనిపించింది రాధాయికి. కొంచెం కొంచెంగా మబ్బుల నోట్లో పడుతున్న చందమామను చూచేసరికి వాడికి భయం కలిగింది. కళ్లు మూసుకున్నాడు. చీకట్లో అన్నీ అల్లిబిల్లిగా తిరుగుతున్నట్లనిపించింది. ఆ అల్లకల్లోలంలో ఎక్కడో ఒక మూలనుండి అస్పష్టంగా రాధాయి కొక్కటే వినిపిస్తున్నది. 'అక్క యిల్లు ఇది కాదుగా, మళ్లీ ఎందుకొస్తుందీ?...'

* * *

భళ్లున తెల్లవారింది. రాధాయి కళ్లు తెరవలేదు. ఒళ్లు సలసలా కాగిపోతున్నది. నాన్న డాక్టర్ని తీసుకొచ్చాడు. రోగలక్షణాలర్థమైనవో లేదో కాని స్టెతస్కోపు ఒక్కమారటూ ఇటూ చూచి మందిచ్చి పోయినాడు డాక్టరు.

మందుగ్లాసు చేత్తో పుచ్చుకుని మందు తాగమని బ్రతిమాలింది అమ్మ.

రాధాయి కళ్లు తెరిచి అమ్మవైపు చూచాడు. ఆచూపుల్లో నీరసమూ, నిరాశా వ్యక్తమౌతున్నై.

'అమ్మా!' అని బరువుగా అన్నాడు. ఏదో మాటాడబోయాడు. వణుకుతున్న పెదవుల మీద మెదులుతున్న మాటలు అస్పష్టంగా కదిలినై 'అక్క మళ్లీరాదు' అని. నాన్నకు గాబరా ఎత్తింది. అక్కడ వైరిచ్చాడు.

'వస్తుంది నాయనా, వస్తుంది' అమ్మ సమాధాన పెట్టాలని ప్రయత్నించింది.

ఆశగా అమ్మవంక చూచాడు. అమ్మ కళ్లనిండా నీళ్లు. ఏడవ్వద్దని చెబుదా మనుకున్నాడు. కాని అంతమాట పెగిలిరాలేదు వాడి కంఠంనుండి. కళ్లు మూతలు పడుతున్నై. నిట్టూర్పులు తీవ్రంగా, వేడిగా ఒస్తున్నై. ఆ తీవ్రతలో వేడిలో ఒకే నిరాశ, నిస్పృహా వ్యక్తమౌతున్నై; 'అక్క ఇల్లు ఇది కాదుగా. మళ్ళీ ఎందుకొస్తుందీ? అని.

రాధాయి మెత్తని మనస్సులో అక్క విడిచిపోయిందన్న బెంగా, మళ్ళీ రాదన్న దిగులూ, కొన్ని అర్థంకాని సమస్యల మధ్య బరువెక్కినై మనస్సు ఉత్సాహంతో నిండిఉన్నదైతే అర్థంకాని ఎన్ని సమస్యలనైనా అవి ఎంత విడదీయరానివైనా సులభంగా జీర్ణించుకుంటుంది. ఎంత ఊహాలకందని రాగాలనైనా సవ్యంగా సారించుకుంటుంది. కాని నిరుత్సాహంతో నిరాశతో నిండిన మనస్సులో సమస్య ఏ కొద్దిదైనా అది సుడితిరుగుతుంది. ఈ అందని రాగాలను సారిస్తున్న మనస్సు సహజంగా పరాజయం పొంది నిరాశను పెంచి అపశ్రుతులను సృష్టిస్తుంది. ఆ అపశ్రుతులు సున్నితంగా పలకవలసిన తంత్రికలను తెంచివేసినా ఆశ్చర్య పడనక్కర్లేదు.

ప్రస్తుతం రాధాయి స్థితి ఇంచుమించు అస్థాయిలో నేఉంది. 'అక్కకు చందమామ, కథలు చెప్పతాడు కొమాలి' అనే భావాన్ని సులభంగా జీర్ణించుకోగలిగిన వాడి హృదయం, 'తన ఇల్లు అక్క ఇల్లు కాకపోవడానికి గల అవ్యక్తమైన కారణాన్వేషణలో అక్క మళ్ళీరాదనే బెంగనూ, అక్కను విడిచి ఉండాలనే దిగులునూ ఖలపరిచింది. ఆ కారణంగా సున్నితమైన రాధాయి మనోవీణలో ఎన్నో అందని రాగాలను సారించవలసివచ్చింది. ఇక దాని ఫలితాన్ని మానసిక తత్వవేత్తలు కూడా తప్పించలేక పోవచ్చు.

డాక్టరొచ్చి మళ్ళీ చూచి వెళ్లాడు ఆయన ముఖంలో ఉన్న ఉదాసీన భావాన్ని 'అక్కను పిలిపించం'డని చెప్పిన మాటనూ చూచి నాన్న గాబరాపడ్డాడు. 'చూడు నాన్నా! ఒక్కసారి చూడు. ఇదిగో అక్క వస్తోంది చూడు' అని నాన్న జీరంగురు గొంతుకతో అన్నాడు.

(43-వ పేజీ చూడండి)


## అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కెర పోవుట అతిమూత్రవ్యాధి అంటారు (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు ఇన్జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధికమూత్రం గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలికయిస్తుంది దీనికి పత్యం లేదు. ఇన్జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి ఉచితంగా పంపుతాము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు 6-12-0 లు
ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రీసెర్చి లేబరేటరీ,
పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)

## హిందీ విద్యాబోధిని

తెలుగక్షరములు తెలిసిన ప్రతివారు ఈ గ్రంథసహాయంవల్ల ఒక నెలలోనే హిందీ భాషను నేర్చుకొనవచ్చును. ఉచ్చారణ, అర్థ వివరణములు తెలుగక్షరములతో యీయబడినవి. హిందీ నేర్చుకొనువారికి ఇది చాల సహాయకారి. వెల 1-4-0 తపాలాఖర్చు వేరు.

## ఆధునిక కామశాస్త్రము

స్త్రీ పురుషులకు సంబంధించిన రహస్య విషయములు, పాశ్చాత్యుల కామకళా గ్రంథములనుండి సేకరింపబడినవి ఇందు గలవు. వెల 2-0-0. తపాలఖర్చు 0-6-0.

ఈశ్వరి & కో,
పోష్టు బాక్సు. 189, మదరాసు-1

# అందని రాగాలు

(15-వ పేజీ తరువాయి)

స్పృహ తప్పిపోతున్న రాధాయికీ మాట స్పృహను కల్గించింది. ఆశతో కళ్లు విప్పాడు. అక్క మొహం కనబడలేదు. అమ్మవంకా నాన్నవంకా ఒక్కమారు చూచాడు. ఆ చూపుల కడ్డంగా—ఆశలో నుండి పూర్తిగా నిరాశలోకి జారిపోతున్న ఆ చూపుల కడ్డంగా—బరువైన రెప్పలు కమ్ముకున్నై. ఆ కమ్మికలో 'అక్క ఇల్లు ఇది కాదుగా' అని ధ్వనించింది. కాని ఆ ధ్వని అందరికీ వినబడదు.

*　　*　　*

అక్క వచ్చేరు వేళైందని అమ్మా నాన్నా ఆశపడుతున్నారు. అప్పటికి పన్నెండు గంటలనుండీ రాధాయిపరిస్థితి క్రమంగా దిగజారిపోయింది. జీవిత స్వభావాలు తెలియకపోయినా కొన్ని నెలలనుండి మాత్రమే జీవించడానికి నేర్చిన పాపాయి ఆ విషాద వాతావరణాన్ని అర్థంచేసికోలేకపోయినా అమ్మ ముఖంలోని విచారచ్ఛాయల నేమైనా అర్థం చేసికోగలిగిందేమో ఏడ్వ మన్నది. పాపాయిని సముదాయిస్తూ అమ్మ రాధాయిని పలుకరిస్తూంది.

రాధాయిలో ఆవేదన కూడా అంతరిస్తున్నది. బిగువుగా వేడిగా వస్తున్న నిట్టూర్పులు చతికిలబడుతున్నై. నాన్న మళ్లీ డాక్టర్ని తీసుకొచ్చాడు. కాని...అతడు విరిచిన పెదవి అమ్మానాన్నలకు కనబడకపోయినా 'మళ్ళీ వస్తా'నని చెప్పి బయటికి వుళ్లిపోయాడు.

ఒక్కమాటు కళ్లు తెరిచి చూచాడు రాధాయి. ఆచూపుల్లో చలనం జారిపోతూ, అమ్మా నాన్నల హృదయాలను కదిలించి వేసింది. రాధాయి మనఃకోణంలో ఆశ పూర్తిగా చెరిగిపోయింది'...రాదు... అక్క...మళ్ళీ...రాదు...వాళ్లిల్లు.... విడిచి...నా ఇంటికి...మళ్లీ...రాదు...'

"అదుగో అక్క!!" అమ్మ వెర్రిగా కేక వేసింది.

ఉలిక్కిపడ్డ రాధాయికళ్లు కష్టంగా తెరుచుకున్నై. ఎదురుగా అక్క మొహం కనిపించింది లీలగా.

"ఆ..." ఆశ్చర్యాన్ని తెలియజేయడానికో, అక్కను పిలవడానికో తెరుచుకున్న నోరు మళ్ళీ మూతబడలేదు.

...గోడ గడియారంలో 'క్లి' ఐపోయి "టిక్కు టక్కు" ఆగిపోయింది...ఆవరించిన నిశ్శబ్దంలో అమ్మా నాన్నల హృదయాలు మాత్రం టప్పుమన్నై.

తరువాతి నెలలో నాన్న బలవంతాన బావ కాపురం బదిలీఐంది. ఇప్పుడక్క వాళ్లిల్లు విడిచి, 'రాధాయి ఇంట్లో' నే ఉంటున్నది. ★

# అత్తలపార్లమెంటు

(19-వ పేజీ తరువాయి)

మని (కొంచెమాగి) ఆ చిన్నవాడు అన్నట్లు మనసంఘానికి "అత్తలపార్లమెంటు సంఘం" అని పేరుపెట్టుదాం.

వెం: చాలా బాగుంది.

మీ: సరే ఆపేరే పెట్టుదాం. వస్తా పొద్దుగూకవచ్చింది.

పా: మేముగూడవస్తున్నాం, అందరం ఆలాగా వచ్చేది. మనసంఘానికి వెంకాయమ్మ వదినెగారిని ప్రెసిడెంటుగా నియమిద్దాం.

మీ, సు: సరే, మాకూ యిది యిష్టమే.

పా: వెంకాయమ్మ వదినెగారూ! కార్యక్రమం సిద్ధం చేయండి.

వెం: చిత్తం.

మీ, పా, సు: వెళ్లొస్తామండి, మనసంగతి మర్చిపోకండి.

వెం: మంచిది. నే నేనా మర్చిపోయేది.

పా: వెంకాయమ్మగారు అసాధ్యులు. (అందరూ నిష్క్రమింతురు) ★

# పత్రిక నేర్పిన పాఠం

(37-పేజీ తరువాయి)

పట్టలేనంత నవ్వు వచ్చి ఫక్కున నవ్వేశాను.

ఇంతకూ మేమంతా పత్రిక చూచి నవ్వటానికి గల కారణమేమో, ప్రతివారము "ఆంధ్ర వారపత్రిక" చదివేవారు గ్రహించి ఉంటారు. అలా మీలో చదువనివాళ్లూ, చదివినా మరచిపోయిన వాళ్లూ వుంటారుకనుక, మేము పత్రిక చూచి నవ్వటానికి గల కారణము వ్రాస్తున్నాను: చదవండి.

ఆ పత్రికలో ఒక కార్టూన్ వుంది. అందులో అచ్చంగా నా చొక్కాలాంటి చొక్కా తొడుక్కొని ఒక అబ్బాయి నిల్చొని వున్నాడు. ఆ చొక్కా మీద ఉన్న పాముబొమ్మని చూసి నిజమైన పాము అనుకొని ఒక గద్ద ఆ సోగ్గాణ్ణి తన్నుకుపోతోంది. ఆ బొమ్మని చూచే నవ్వాము మేమందరమూ!

అప్పటికి గాని, నాన్నతో పాటు నాకూ, గద్ద తన్నటానికి కారణము తెలిసింది కాదు. ఇక మీదట ఇక్కడ ఉంటే మంచిది కాదని, నాన్న అమ్మ ఎంత వద్దన్నా వినకుండా మిగిలిన శెలవురోజులు పట్నంలోనే గడపవచ్చునని ఆంధ్రపత్రిక చేత బుద్ధ్యకొని, మరునాడే 10 గంటల ఎక్స్‌ప్రెస్‌కు టిక్కెట్టు తెప్పించుకొన్నాను. ఇక అప్పటినుంచీ నాకు ఆ 'పూలజాకెట్లు' తొడుక్కోవడమంటే మాచెడ్డభయం వేస్తోంది!

'ఫైలేర్'

బోదజ్వరములను నివారించి వాపులను పోగొట్టును. చాలమంది రోగులు దీనినివాడి మంచి ఫలితములనుపొందిరి. 1½ నెలలకు సరిపడుమందు రు. 3/-

తోలేటి ఆంజనేయులు & సన్

మారుటేరు, ప. గో. జిల్లా.